కథా నిలయం
1104
శ్రీకాకుళం

# అనూరాధ కథ

దొడ్డిలో బాదంచెట్టుమీద మాలకాకి అరుస్తున్నది. అనూ అక్కడే నిల్చునిదాన్ని అదిలిస్తున్నది. అయినా అది పోవటంలేదు. మూడిళ్ళవతల అప్‌స్టెయిర్స్‌మీద నిలుచుని కాలేజీకుర్రాడు అనూరాధని చూస్తున్నాడు.

ఆ కాకి అలా అరుస్తుంటే అమ్మకి చిర్రెత్తు కొస్తున్నది, 'ఛీ! భ్రష్టుముండా' అని దాన్ని తిట్టి పోస్తున్నది. మరేంలేదుకాని, కాకి అరిస్తే చుట్టాలు వస్తారట! ఆమెకి గట్టి నమ్మకం. వేళకాని వేళ చుట్టాలొచ్చిపడితే ఎలా చావటం? అయినా తమఇంటికి ఎవరూ రారని గట్టిగా తెలుసు. ఏదో తామిద్దరూ తల్లీ కూతుళ్లు గుట్టు చక్కంగా కాలక్షేపం చేస్తున్నారు.

ఆమెకి కష్టాలొచ్చి నాలుగేళ్ళు కావస్తున్నది. అనూరాధ కప్పటికి పన్నెండేళ్లు. ఆమె పని పూలమ్మిన వూళ్లో కట్టెలమ్మాల్సి వచ్చినట్లయింది. అయినవాళ్ళు ఆదుకోలేదు. ఎందుకంటే, ఆమె మొగుడేమీ నిల్వచేసి పోలేదు. పైన పన్నెండేళ్ల ఆడపిల్ల. ఎవరో వేలు విడిచిన అన్న పంచన ఐదారు నెలలు చేరింది. తరువాత ఆడాళ్లకి ఆడాళ్లకి పడలేదు. ఆయన మంచివాడే. అయితేనేం, వాళ్లు వేరేవెళ్లారు. ఆయన ప్రావిడెంట్ ఫండ్ తాలూకు కొంత డబ్బువచ్చింది. ఈ పెంకుటింట్లో ఎలానో జీవితాన్ని పరులకంట పడకుండా పరువుగా ఈడ్చు కొస్తున్నారు. బరువుగా కూడా.

ఆమె దిగులల్లా అనూకి ఎలా పెళ్ళి చెయ్యటం? అనే. ఒకదోవా తెన్నూ కన్పించటం లేదు ఒక్కరూ ఆదుకోరు. ఏలా?

అలానే జీవితాన్ని ఈడ్చుకొస్తున్నారు. ఆమెకి అనూని చూస్తే కోపం. ఒకప్పుడు జాలి. ఒక్కోసారి నిర్లక్ష్యం. ఒక్కోసారి వేదన.

బాగా ఏపుగా ఎదగగలిగిన పిల్ల. అప్పుడే బిడ్డతల్లిలా ఎదిగింది. పదిహేనోయేడు మొన్ననే వెళ్లిందంటే ఎవరూ వొప్పుకోరు గదా? అందరూ చెవులు కొరుక్కోవటమే! ఫలాని పార్వతమ్మ కూతురికి పాతికేళ్లొచ్చాయి. ఇంకా పెళ్ళి కాలేదు. గుసగుసలు. కొంత మందికి వినపడేటట్లు అంటే కాని తృప్తి కలుగదు. ఆమె ఎంత వినవద్దనుకున్నా వినపడతవి.

"ఇదుగో వదినా! పార్వతమ్మ కూతురికి పెళ్లి చెయ్యదాయేం?"

"ఇదిగో నమ్మోయ్! నాకు తెలీకడుగుతాను గాని వాళ్ళ అనూరాధ పెళ్లి చేసుకోదటగా!"

"ఆ, ఇంకా రెండేళ్లు ఇలానే వుంటే, దాన్ని చేసుకునేదెవడు, ఇప్పటికే చెట్టంత—"

ఇవన్నీ ఆమెకు వినపడేవి.

ఆమె వేళ్లు లెక్క పెట్టుకుని మరీ మరీ జ్ఞాపకం తెచ్చుకుంది, అనూకి పదహారోయేడు. అయినా వీళ్లందరికీ ఎందుకు? చదువుకుంటూంటే నలభై ఏళ్లదాకా అయినా పెళ్లి లేకుండా వుండవచ్చునట. తాను అనూకి చదువు చెప్పించినట్లయితే బాగుండేది.

అనూకి చదువులేదు. నల్లగా పొడుగ్గా వుంటుంది.

అనూకి ఎలా పెళ్లవుతుంది? అనూని ఎవరు ఇంక చేసుకుంటారు? అదే బాధ. ఆమెకు నిద్రపట్టదు. ఆమెకెప్పుడూ ఇదే దిగులు

అనూరాధ—

అవును. నేను నల్లగా వుంటానంటే ఇందులో నా తప్పేముంది? ప్రపంచంలో అంతా చక్కనివాళ్ళే వుంటారా? అమ్మ చాలా చక్కనిది. నాన్న బాగా గుర్తున్నాడు. గుర్తు లేకపోవటమేం?

ఆయనది కారునలుపు శరీరం. పొట్టిగా లావుగా వుండేవారు అమ్మది పచ్చటి శరీరచ్ఛాయే. పొడుగ్గా బెత్తంలాగా చక్కగా వుంటుంది. అమ్మ పొడుగునీ, నాన్ననలుపునీ పంచుకుని నేను పుట్టాను. నాన్నగారు పోయేదాకా దిగులంటే ఎలా వుంటుందో నేను ఎరుగను. నేను నలుపుగా వున్నా చాలా చక్కటిదాన్ని అంటుండేవాడు నాన్న. అమ్మ ఉల్పించుకుని 'మీకూతురే అచ్చు మీపోలికే అంటుండేది. అవునని నాన్న మురిసిపొయ్యేవాడు. నాన్నేవుంటేనా?... ఆ తలంపు కలిగితేనే నాకు ఆపుకోలేని దుఃఖం వస్తున్నది. నాన్న వుంటే నాకు ఇంత దురవస్థ ఎందుకు కలుగుతుంది. ఇలా లోకమంతా నా గురించి చర్చించుకునే దుర్గతి ఎందుకు పడుతుంది. నేను చచ్చిపోతే బావుండును. అమ్మో?అమ్మ వొంటరిదై పోతుంది. నాకు పెళ్ళికాకపోతే వీళ్ళకెందుకు.

అమ్మకు కూడా నేనంటే అసహ్యమే! ఊరకనే తిడుతుంది. నేను ఏదైనా భరించగలనుగాని నిష్కారణంగా అమ్మ ఒక్కరోజు నా హృదయం భేదించుకునిపొయ్యే మాటలంటుంటే భరించలేను.

'నువ్వు నా కడుపున పుట్టాల్సిన దానివి కాదే దరిద్రపు మొహమా! నువ్వు మొగ నలుసువై పుట్టివుంటే ఎంత సుఖపడిపోదును? నల్లగా, రాచ్చిప్పలాగా నువ్వూ, నీ ముఖమూ!' ఏ అమ్మ అయినా ఇలా అంటుందా- అని కొందరు సందేహిస్తారు. ఆ సందేహం అవసరంలేదు. అమ్మ నన్ను తిట్టే తిట్లలో కొన్ని అతి సామాన్యమైనవి మచ్చుకు ఏరి చూపించాను అంతే. ఇవి నాకొక లెక్కలోనివి కావు. అలవాటై పోయినయ్.

ఎప్పుడైనా అమ్మ కోపంతో తిడుతుంటే, ఈ భూమి వున్న పళంగా బ్రద్దలైపోతే అందులో కూరుకపోదామని అనిపిస్తుండేది. చెప్ప కుండా ఏ అర్ధరాత్రి వేళో లేచి నూతిలో దూకుదామని అనిపించేది కాని అమ్మ అసహాయురాలై, ఏమీ తోచక తిడుతుంది. అంతే కాని నామీద ప్రేమ లేక కాదు. అది నాకు తెలుసు. అందుకే నేను బ్రతుకు తున్నాను.

నేను ఒక్క గంట కనపడకపోతే కావలించుకుని ఏడుస్తుంది. వాళ్లకళ్ళు కాలిపోను. నా తల్లిని నలుపస ఎవర్రా అనేది' అని ఏవేవో గుర్తుతెచ్చుకుని అందరినీ కలిపి తిడుతుంది. ఆవాళ నాకు అన్నం కలిపి చేతిలో పెడుతుంది. అమ్మకి పిచ్చి కోపం. పిచ్చి ప్రేమ. ప్రేమ. 'నా అనూ, నా బంగారం, ఎందుకమ్మా అలా ముఖం వాడి పోయింది! నీ కెందుకే తల్లీ దిగులు. నీది మంచి జాతకం. నాన్నగారు వ్రాయించారు గదూ! లే తల్లీ, నీళ్లోసుకుని రా. అన్నం పెడతాను కాసింత కాఫీ కాచియ్యనా?"

కోపం- "పూజ కొద్దీ పురుషుడూ, దానంకొద్దీ బిడ్డలూనట. ఎంత చేసుకున్నవారికి అంత! తులసిదేవికి మొక్కితే పుణ్యంకాని దూలగొండికి మొక్కితే ఏముంది? ఏం నోములు నోచానో. ఇలాటి కొరివిదయ్యం పుట్టింది. లే నాముందు కనపడకు. ఇక్కడ నుంచి వెళ్ళిపో—"

ఇదీవరస. నేనేంచెయ్యను. అమ్మను చూస్తే ఒక్కసారిపట్టరాని కోపమొస్తుంది. ఒక్కొకసారి చెప్పలేని జాలి కలుగుతుంది. ఆమె నన్ను చూసుకునే బ్రతుకుతున్నది. నా సుఖమే ఆమె సుఖం. నా ముఖం వాడిపోతే ఆవాళ ఆమె అన్నం తినదు. చెప్పుకుంటే సిగ్గుచేటు. నాకు పదహారోయేడు గడుస్తున్నది. ఇప్పటికీ అమ్మ నాకు

దిష్టి తీస్తుంది, ఇంత వుప్పుపట్టుకుని. నాఅందానికి తోడు నాకెవరు దిష్టి పెడతారో! ఆమాట నేనంటే, మూర్ధం అఘ్రాణించి, చుబుకం పట్టి ముఖం పైకెత్తి 'నీకేమే నా తల్లీ! రాచవాళ్ల ఇంట్లో పుట్టాల్సి దానివి' అంటుంది. ఏ రోజు ఇంట్లో కాని నేను మామూలుగా మాట్లాడకపోతే ఆవాళ ముఖం చిన్నబోతుంది. నాకు జ్వరం వస్తే ఆమె బాధ చెప్పడానికి వీల్లేదు. నిద్రాహారాలు వర్జిస్తుంది. 'తల్లీ! తల్లీ; అమ్మా, అమ్మా, ఇంతే ఎప్పుడూ. ఎన్ని ఇష్టదేవతా ప్రార్థనలో, ఎన్నిముడుపులో. తనకి ఏనాడేనా వొంట్లో సుస్తీ చేస్తే నేను తన దగ్గర పొద్దుపోయిన దాకా కూచోటానికే వీలులేదు. పోయి పడుకోమంటుంది. లేవకపోతే అరుస్తుంది. లేకపోతే తిడుతుంది.

ఇంతకూ ఎప్పుడూ నా పెళ్ళిని గురించే ఆలోచిస్తూ ఆమె మనసు చెడగొట్టు కుంటున్నది. అదే నా బాధ

నా పెళ్లి అవటానికి, కాకపోవటానికి నా చేతుల్లో ఏముంది? నేను అనాకారి నవటానికి నే చేసిన తప్పేముంది. అనాకారిని కావం టుంది అమ్మ. కాకపోవచ్చు. అవ్వచ్చు. నేను నల్లగా వుంటా నంటే అందుకు బాధ్యురాల్ని నేనా?

ఎంతమంది నల్లటివాళ్ళకు పెళ్ళిళ్లు కావటంలేదు. నల్లటి వాళ్ళకు పెళ్ళే కాకపోతే నాన్నకు పెళ్లి అయివుండేది కాదు. మొగ వాడంటా రేమో? అయితే ఎంతమంది నల్లటమ్మాయిలకు పెళ్ళిళ్లు కావటంలేదు. ఎదురింటి ప్లీడరుగారమ్మాయి బాగా నలుపుకిందనే లెక్క. అయినా ఆ అమ్మాయికి పెళ్ళి కాలేదా? పెళ్లి కాకపోవట మేం? పెళ్ళయింది. అమ్మాయి మొగుడు ఎఱ్ఱగా వుంటాడు. దీని కేమంటారు, ప్లీడరుగారికి బాగా డబ్బుంది అంటారు. అవును. నేనూ వొప్పుకొంటాను. మా అమ్మ నాలుగు వేల కట్నం ఎలా ఇస్తుంది

ఎలా ఇవ్వగలుగుతుంది? మేము నాలుగేళ్లనుంచి ఎలా బతుకుతున్నాం? అందుకనే తొందరగా నా పెళ్లి అయితే బాగుండునని అమ్మ వాంఛించటంలోనూ, కోటి దేవుళ్లకు మొక్కుకోవటంలోనూ తప్పు లేదు.

ఇంతకూ శేఖరం బావ ననాలి. నాన్నగారు వున్నంత వరకూ శేఖరం బావకీ, అత్తయ్యకీ, మామయ్యకీ,-అందరికీ ఇష్టమే నేనంటే. ఇప్పుడు ఇష్టంలేకపోయింది. ఎందుకంటే ఎవరూ ఏమీ చెప్పరు. ఒకసారి ధైర్యంచేసి శేఖరం బావని నిలేసి నేనే అడిగాను. "ఏం బావా' నేనంటే ఎందు కిష్టంలేదు నీకు? అప్పుడంతా ఇష్టమేకదా?"

బావ అటూ ఇటూ చూసి నా బుగ్గ గిల్లాడు. నాకు చెడ్డ చిరాకు పుట్టుకొచ్చింది. మీదపడి రక్కుదామనుకున్నాను. "నేనంటే ఇష్టంలేనివాడికి, నన్ను చేసుకోనని, చేసుకోలేనని తెగేసి ఖండితంగా చెప్పినవాడికి నన్ను ముట్టుకోవాలన్న తెగులెందుకు?"

"నన్ను ముట్టుకున్నావా? జాగ్రత్త! ముందు నేనడిగిన దానికి సమాధానం చెప్పు" అని తీవ్రంగానే అడిగాను. బావ మహా చిరాకు పడ్డాడు. కాసేపు ఆలోచించి తన తెలివంతా వుపయోగించి పెద్ద పెట్టున నవ్వుతూ, "నీ నలుపు నాకూ కూడా అంటుతుందని భయం" అన్నాడు. నాకు పౌరుషొచ్చింది. చాలా అభిమానం వచ్చింది. నేనేం చెయ్యను. నా ఖర్మ అని వూరుకున్నాను. ఆ మధ్యాహ్నం కాఫీ తీసుకెళ్లి ఇచ్చి కిటికీ లోంచి బయటకి చూస్తుంటే బావ "హుష్ కాకీ" అంటం మొదలెట్టాడు. నేను నిజమే ననుకున్నాను. తరువాత తెలిసింది. నేను కాకి నలుపట. అవును శేఖరం బావ చెన్నపట్నంలో చదువుకుంటున్నాడు. అక్కడ ఎంతమందో చక్కని చుక్కలు. నేను కాకి నలుపుగానే కనబడతాను. తరువాత అమ్మ అడిగింద.

"నేను చేసుకోను" అని ఖండితంగా చెప్పిపోయినాడు. అమ్మ ఆవాళనుంచే మారిపోయింది. ఎంతో ఆశతోవున్న అమ్మ ఈ సంఘటనకి తట్టుకోలేక తలకిందులైంది. అప్పటినుంచే నేనంటే కోపం, అసహ్యం. నాన్నగారుంటే బావ అలా అనగలిగేవాడా? అయినా ఇష్టంలేని నేను ఆయన్ను చేసుకుని మాత్రం ఏం సుఖపడతాను? బావ మాత్రం ఏం సుఖపడతాడు. అమ్మ ఇవేమీ ఆలోచించదు. శేఖరం బావది ఏమీ తప్పులేదు అందులో. తప్పంతా నాదే నేను నలుపు కావటమే! అందుకని నేను అనుభవించాల్సిందే.

లోకంలో ఇంత అసహ్యంగా చూడబడతానని తెలిసినట్లయితే ఆ బ్రహ్మదేవుడి ముందు కాళ్లా వేళ్లా పడి రంగు మార్పించుకునేదాన్ని. ఈమాటే అమ్మతో అంటే, ఆమె నవ్వుతుంది ఏడుపును మేళవించి. శేఖరం బావ! శేఖరం బావని తలుచుకుంటేనే నాకు అసహ్యం పుడుతోంది. అసహ్యంతో కుంచించుకుని పోతున్నాను. రెండేళ్లయింది శేఖరం బావకి వుత్తరం వ్రాసి నేను. ఏమని వ్రాస్తాను. మా ఇద్దరి మధ్యా బాంధవ్యం, స్నేహం, ప్రేమ- అన్నీ మంచువలె కరగిపోయినయ్. అంతా మిథ్య అయిపోయింది. నాన్న మేనల్లుడని ఎన్నో ఆశాసౌధాలు నిర్మించుకుని, అవి మాకు చూపిపోయినాడు. అవి మేము చూస్తుండగానే నేలమట్ట మయిపోయినయ్. పూర్తిగా విధ్వంసమైనయ్ అదే మా బాధ.

ఈ రెండేళ్లలోనూ అమ్మ మూడు నాలుగు సంబంధాలు చూసింది. నాకు వేలు విడిచిన మేనమామ వొకడున్నాడు. ఆయన వేలు విడిచినవాడైనా అప్పుడప్పుడొచ్చి మమ్ముల్ని గట్టిగా పట్టుకుంటాడు.

నా పెళ్లి గురించి ఆయనకు ఎక్కడలేని బెంగ పట్టుకుంది. ఆయన పరువు పోతున్నదట. "నలుగురూ నన్ను నానా అంటున్నారు" అంటాడు ఎప్పుడూ వచ్చి. ఆయనకి పెళ్ళి కావలసిన కొడుకులు కూతుళ్ళూ వున్నారు. వాళ్ళకి నా మూలంగా పెళ్ళి సంబంధాలు రావటం లేదు అంటాడు. నేను చచ్చేదా? ఎలా!

ఆయనే ఈ సంబంధాలు చూశాడు. ఈ సంబంధాల్లో వొక సంబంధం. కుర్రాడు స్కూల్ ఫైనలు తప్పి ఎక్కడో ఏదో ఎలానో పొట్ట పోసుకుంటున్నాడు. అతడికి నేను నచ్చలేదు. నా నలుపే కారణం అమ్మ ఆ రోజుల్లా దిగులుపడ్డది. నన్ను ఎన్నో తిట్టింది.

రెండో సబంధం. మూడు వేల కట్నం బాపతుది. ఈసారికూడా అమ్మ నన్నే తిట్టింది. మూడో సబంధం. ఆ అబ్బాయికి పుట్టెడు చెముడు. నేను చేసుకోనన్నాను. అమ్మ అప్పుడేమన లేదు కాని తరువాత తిట్టింది. ఇంకోటి, ఇలానే ఏదో వచ్చి కాలేదు. అమ్మకి, నాకు పెళ్ళి కాదని దృఢమైన నమ్మకం. అదే ఆమె బెంగ. నాలుగు రోజులు జ్వరమొచ్చి మంచాన పడితే చాలు వొకటే దిగులు పడుతుంది. అనూ ఎలా నమ్మా నేనీసారి బ్రతకను. చచ్చిపోతాను. నీవెలానమ్మా? నీవేమవుతావ్? నీ పెళ్ళి చూసి పొయ్యే యోగ్యత లేదు నాకు' అంటూ నన్ను కావలించుకుని ఏడుస్తుంది. ఏమిటో అమ్మ పిచ్చిది. నేను వెర్రిదాన్ని. నాకు వీసమెత్తు దిగుల్లేదు. చింత లేదు. ఇలానే కాలం గడుస్తుంది. గడవకేం చేస్తుంది?

నేను దిగులుపడను. దిగులుపడి ఏం చేస్తాను. ఇంకా కృంగిపోవటం తప్పితే! అద్దంలో చూసుకుందామనుకున్నా. నాకు భయమే. ఎందుకంటే నన్ను చూస్తే నాకు భయం. నాకు నేనే

ఇరవై యేళ్ళ దానిలా కన్పిస్తాను. ఇక ఇతరులెందు కనుకోరూ? అమ్మ కొక్కత్తెకి నేను చంటిదానిలా కన్పిస్తానేమో? అయినా ఇక నేను ఆలోచించను. ఇక నేను మాట్లాడను ఎలా జరగాల్సివుంటే అలా జరుగుతుంది. ఇదీ నా కథ

కథకుడు:

బాదంచెట్టుమీద మాలకాకి నెలా అయితేనేం తోలింది అనూరాధ. మూడిళ్లవతల అప్‌స్టైయిర్స్ మీద నిలుచుని వున్న కాలేజీ కుర్రాడికేసి చూసింది. అతడు అనూరాధ కేసి చూసి అసహ్యంగా నవ్వాడు. అనూరాధ కేడుపొచ్చింది. గబ గబా ఇంట్లోకి వెళ్ళింది. అమ్మ పొయ్యి ముందు కూచుని గొణుక్కుంటున్నది. అనూరాధ కప్పుడే భయం పుట్టింది. అమ్మ విసుక్కున్నా. గొణుక్కున్నా ఏదో గభస జరుగుతుందనీ, తనకి తిట్లు తప్పవనీ అనూకి తెలుసు. వర్షాత్పూర్వ వాతావరణాన్ని, అమ్మ గొణుగుళ్ళతో పోల్చవచ్చు. అమ్మ తిట్ల వర్షానికి ముందు గొణుగుళ్ళే మేఘాలు.

అమ్మ ఇసుక్కోడానికి, ఇంతకీ పెద్ద కారణం ఏమీ లేదు. పొయ్యిలో మంట రాజుకుంటూ హోరు పెడుతోంది. అలా మంట శబ్దం చేస్తే ఇంటికి చుట్టాలు వస్తారట.

'అనూ' అని పిలిచింది అమ్మ.

అనూకి వణుకు పుట్టింది.

మెల్లగా వచ్చి "ఏమిటమ్మా" అన్నది.

ఆమె అనూకేసి చూసి ఏమీ చెప్పలేకపోయింది.

ఆమె కళ్ళెన్ని ఆలోచనలో ముసురుకున్నాయి.

చెట్టంత కూతుర్ని చూస్తుంటే ఎంతో దిగులైంది.

ఇంతలోకే వాకిలి చప్పుడైంది. ఎవరో నడిచి వచ్చి సంచీ వంకెకు తగిల్చాడు.

"ఇప్పుడేనా అన్నయ్యా వస్తుంట?" అని అమ్మ అడిగింది. అనూరాధ ముఖం పక్కకి తిప్పేసుకుంది. తనకి పెళ్లి సభంధం ఏదో తీసుకొచ్చాడులా వుంది. ప్రశాంతమైన ప్రవాహంలో వో మట్టిబెడ్డ విసరి అల్లకల్లోలం చేసినట్లుగా ఈయన ఎప్పుడో వస్తాడు. ఏదో సంబధం తెస్తాడు. అది కాదు. వాళ్ళు తనకి వంకలు పెట్టివెళతారు. అమ్మ ఏడుస్తుంది. తాను చాటుగా కళ్ళు తుడుచుకుంటుంది. ఎందుకొచ్చిన అవస్థ? ఇవన్నీ మరచిపోయి కొన్నాళ్ళయినా హాయిగా బ్రతకగలిగితే బాగుండును.

ఆయన పెద్ద వుపోద్ఘాతం లేకుండా సంబంధం సంగతి చెప్పాడు. అయినా అతగాడికి పిల్ల నచ్చవద్దా, ప్చ్—అని తానే తేల్చాడు. "అయితే నీ అదృష్టం" అన్నాడు అమ్మతో. "ఎల్లుండి సాయంకాలం అతణ్ణి వెంటబెట్టుకొని నేను వస్తాను పార్వతమ్మా" అని చెప్పి భోంచేసి పోయాడు.

అనూరాధ:

వేలు విడిచిన మేనమామ వచ్చి పోయినప్పటినుంచీ నాకెంత దిగులైందో! అమ్మకి తెలీకుండా బాదంచెట్టు కింద నిల్చుని కాస్సేపు ఏడ్చాను. ఎల్లుండి వస్తానని చెప్పిపోయినాడు మావయ్య. ఈయనకి వేరే పనేమీ లేదులా వుంది. నా ప్రాణం విసిగిస్తున్నాడు ఈ వచ్చే మన్మధుడికి మాత్రం నేను నచ్చుతానా?

నా గతి ఇంతేనేమో? అతనూ నాకు నచ్చలేదని వెళ్ళటం, అమ్మ ఏడువటం, నేను కృంగిపోవటం· ఇంతే కదా?

కష్టాలు అనుభవించీ, అనుభవించీ మానవ హృదయాలు గడ్డ కట్టుకపోతాయ్· అలానే నేను కూడా, ఇక వేటికీ చలించకూడదనీ వేటినీ లక్ష్య పెట్టకూడదనీ నిర్ణయానికొచ్చాను· మామూలుగానే వున్నాను. కాని నా దురదృష్టం అమ్మకి మర్రోజే కొండలపెట్టు జ్వరం వచ్చింది. ఆ జ్వరములోనే నామీద తిట్లవర్షం ప్రారంభ మైంది· ఆమెకి జ్వరం రావటానికి కారణం నేనేనట: నా పెళ్ళి చూసే అదృష్టం తనకిలేదు కాబట్టే జ్వరం వచ్చింది. నేను నష్ట జాతకురాల్ని. నేను ఆమె కష్టాలకే పుట్టాను· ఆమె ప్రాణాలు తీసేస్తున్నాను.

ఇలా మొదలెట్టింది. ఆరోజు మధ్యాహ్నం బార్లీగంజి కాచి అమ్మ దగ్గరికి తీసికెళ్ళాను. ఆవాళ సాయంకాలానికే నన్ను చూడ టానికి వస్తారు.

"అమ్మా, ఈకాస్త జావ తాగు" అన్నాను·

అమ్మ దుప్పటి తొలగించి నావేపు చూసింది. అలవాటు లేక పోవటంవల్ల, నా కళ్లు పొగకి ఎర్రబడి వాచినాయ్. ముఖమంతా వుబ్బుగావుంది. జుట్టంతా విరియబారి వుంది· అమ్మ నన్నుచూసి నా చేతిలోని బార్లీగంజి తీసుకుని విసిరి నేలకేసి కొట్టింది· అమ్మ కంత కోపమెందుకో అర్థంకాక వణికిపోయినాను ఏడుపొచ్చింది. సన్న గొంతుకతో ఏడ్చాను· పెద్దగా ఏడవాలన్నా భయమే!

"పోవే, దరిద్రపు మొహమా, పోలేరమ్మలా ఎలా వున్నావో చూసుకో, నీకు పెళ్ళిలేదు పెటాకులూలేదు. పూజకొద్దీ—" అని తిట్టింది.

నేను వంట ఇంట్లోకెళ్లి గోడకు తల ఆన్చి ఎంతసేపు ఏడ్చానో నావీపు మీద, ఎవరో నిమిరినట్లు అన్పించి చూశాను—అమ్మ!

నడవలేక పాకుకుంటూ వచ్చింది. కావిలించుకుని ఏడ్చింది. "కోపంలో అన్నానమ్మా! అన్నం తినలేదా? నేను పెడతాను కూచో" అన్నది. నాకు మరీ ఏడు పెక్కువైంది.

"ఛా! ఎందుకేనా తల్లీ! ఇంకా సేపటికి వాళ్లొస్తారమ్మా, లే" అన్నది. నాకు చప్పున గుర్తొచ్చి వెంటనే లేచాను.

సాయంత్రానికి వాళ్లొచ్చారు.

ఎంతసేపటికీ తెమలలేకపోయాను. అద్దంముందు కూచుని నేనే జడవేసుకున్నాను. పడుతూ లేస్తూ అలానే వచ్చి అమ్మ చామంతిపూలు చుట్టి తలలో పెట్టింది. నేనే కాఫీ కాచాను. మావయ్య అథారిటీ ఎక్కువైంది. పదిసార్లు వచ్చి పొయ్యాడు, ఇక తెములూ అంటూ. నన్నెవ్వరూ రెక్క పట్టుకుని తీసుకెళ్ళి కూచోపెట్టేవాళ్ళలేరు. అమ్మకి కోపంగా వుంది నేను తొందరగా వాళ్ళు కూచున్న గదిలోకి పరిగెత్తటంలేదని. అవతల కుర్రాడికి రైలు టైమవుతున్నదట. మావయ్య వచ్చి గట్టిగా కేక వేశాడు. ఆయనే కాఫీ తీసుకెళ్ళాడు. చివరిసారి అద్దంలో ముఖం చూసుకున్నాను. పౌడరు సరిగ్గా అతక్క బుగ్గమీద చార కన్పించింది. కళ్ళుఇంకా వాచేవున్నాయి. పౌడరుద్దుకుంటున్నాను. మావయ్య అరిచాడు. అమ్మకి కోపం వొచ్చింది "నీ అందానికేం తక్కువ కాలేదులే ఇక తెములూ" అన్నదిఅమ్మ. నా ప్రాణం చివుక్కుమనిపించింది.

ఎలానైతేనేం వెళ్ళి వాళ్ళ ముందు కూలబడ్డాను. కళ్ళెత్తి చూడలేకపోయాను ఆ కుర్రాణ్ణి. అయినా కనురెప్పలు సగంమూసీ సగం తెరచీ చూశాను. నాకు భలే భయమేసింది. నిజంగా మన్మధుడే. ఇతని కెలాగూ నేను నచ్చను అని దిగులైంది. అతడు నావేపు చిరునవ్వుతో చూస్తుంటే నా ప్రాణాలు ఎక్కడికో లేచిపోయినయ్. ఎంత అందంగా వున్నారు? ఎంత బావున్నారు? ఆయన నన్ను చేసుకుంటానికి వొప్పుకుంటే ఆయనపాదాలు కన్నీళ్లతో కడగనా?

ఉత్తరం రాస్తానని వెళ్లిపోయారు. మావయ్య ఆయన్ని వాకిలి దాకా పంపించి వచ్చాడు. అమ్మ నీరసంగా అడిగింది. "కుర్రాడి పేరేమిటి"? "ఆనందమూర్తి". నా గుండె ఆనందంతో కొట్టుకలాడింది.

"ఏం పని?" అమ్మ అడుగుతున్నది,

"ఏదో పత్రికాఫీసులో చిన్న వుద్యోగం."

ఉద్యోగం లేకపోతేనేం? ఆస్తిపాస్తులు లేకపోతేనేం? సంపాదించ లేకపోతేనేం? అనుకున్నాను. ఆ నాలుగు రోజులూ నాకు ఒక్క యుగమైంది. ఎప్పుడూ వీధిలో నిల్చుండేదాన్ని పోస్టువాడి కోసం. ఈ ఆత్రం ఎందుకు? ఎవరికోసం ఈ నిరీక్షణ? పోస్టుమేన్ వచ్చాడు. ఉత్తరం ఇచ్చాడు. అందులో "నాకు ఇష్టమే—ఆనందమూర్తి" అని వుంది. నాకు చైతన్యం తప్పినట్లనిపించింది. గాలిలో తేలిపోయాను. ఆ వుత్తరంలోని అక్షరాలు పూల బాణాలుగా నా హృదయంలో గుచ్చుకున్నయ్.

నాకూ పెండ్లయింది.

"ఏయ్. అమ్మాయ్, ఇలారా?"

"ఎందుకండీ ఆనందమూర్తిగారూ!"

"ఏయ్ చిలిపీ! అలా పేరెట్టి పిలవొచ్చునా, తప్పు కాదూ!" తెరలు తెరలుగా నవ్వేదాన్ని.

"నా కొకందుకు భయమేస్తున్నదండీ!"

"ఎందుకండీ?"

"నా నలుపు మీ కంటుతుందేమోనని!"

"నువ్వు నలుపైతేనేం. నువ్వు నా దేవతవు, అనూ!" అంటా రాయన. నాకళ్లు చెమ్మగిల్లేవి. నా హృదయం సరిగమలు పలికేది.